సాక్షి ఆదిలాబాద్

సోమవారం ၊ 3 ၊ జూలై ၊ 2023



గోరింట పండింది.. 9లో ▸

ఆషాఢ మాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం గోరింట పండుగ నిర్వహించారు.



జంగిల్ సఫారీకి బ్రేక్ 8లో ▸

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని అటవీ అందాలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీకి బ్రేక్ పడింది. వాహనం బురదలో కూరుకుపోతుందని సెప్టెంబర్ 30 వరకు నిలిపివేశారు.

గరిష్టం/కనిష్టం
35.0/27.0

వాతావరణం

ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే జోగు రామన్నను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో సీపీఎస్ అమలులో లేనప్పుడు నోటిఫికేషన్ విడుదలైందని, ఆ నియామక ప్రక్రియ ముగించే సమయంలో అప్పటి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సెంట్రల్ మెమో 57 విడుదల చేసిందని, తెలంగాణ ప్రభుత్వం కూడా డీఎస్సీ 2003 వారిని పాత పెన్షన్ విధానంలోకి మార్చాలని తెలిపారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు సాగర్‌రెడ్డి, అన్వర్ అలీ, నిజామొద్దీన్, సంతోష్, సుభాష్, నీల దేశ్‌పాండే, అంజలి, రేణుక, అనిత, జ్యోతి తదితరులున్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సార్క్‌నేషన్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ పున్నారావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయాలని, పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందులోలక్ష్మణ్, రవిందర్, అజయ్, శైలేందర్, సునీల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణిలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుబంధ కార్మిక సంఘంగా ఉండి కార్మికులకు రావాల్సిన హక్కులు, పీఆర్సీ, ఇతర వాటిని సాధించుకుంటున్నామని తెలిపారు. రెండో పీఆర్సీలో 2022 ఏప్రిల్ నుంచి 7 శాతం ఫిట్‌మెంట్‌తో 13 నెలల పాటు చెల్లిస్తారని పేర్కొన్నారు. అలాగే మెడికల్‌కు సంబంధించి గతంలో రూ.5లక్షలు ఉంటే, ప్రస్తుతం రూ.12 లక్షలకు పెంచినట్లు తెలిపారు. కార్మికుల హక్కులతో పాటు అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవిదాస్, విష్ణు, మల్లేశ్, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా గంగారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన గంగారెడ్డిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న ఆదిలాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అనంతరం డెమో నిర్వహిస్తామని వెల్లడించారు. బాలుర గురుకులాల్లో జూనియర్ లెక్చరర్ (భౌతికశాస్త్రం), పీజీటీలో ఆంగ్లం, గణితం ఒక్కో పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. బాలికల గురుకులంలో జూనియర్ లెక్చరర్ ఆంగ్లం, జువాలజీ ఒక్కో పోస్టు, పీజీటీలో సోషల్, టీజీటీలో గణితం ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు 50 శాతం మార్కులతో పీజీతో పాటు బీఈడీ, అలాగే టీజీటీ పోస్టుకు డిగ్రీతో పాటు బీఈడీ అర్హత ఉండాలని పేర్కొన్నారు.



ఇక్కడ కనిపిస్తున్న విద్యార్థి రుషికేష్, ప్రస్తుతం ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సిరికొండ మండలం పొన్నకు చెందిన ఈ బాలుడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గతేడాది ఎనిమిదో తరగతి చదివే క్రమంలో ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా ఓ ప్రాజెక్టును రూపొందించాడు. రైల్వేకోచ్‌లో గర్భిణి, రోగుల కోసం అత్యవసర సమయంలో వైద్యం అందించే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు జిల్లా నుంచి రాష్ట్ర, తర్వాత జాతీయస్థాయికి ఎంపికైంది. తాజాగా అంతర్జాతీయ స్థాయికి కూడా ఎంపికకావడం గమనార్హం.



వేసవిలో చిన్న పిల్లలు వేడిగాలి బారిన పడకుండా ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థి డి.కృష్ణకుమార్ ఓ కూలర్‌ను తయారు చేశాడు. చిన్న చిన్న నీటి తుంపర్లతో ఇది పనిచేస్తుంది. తొమ్మిది వోల్టేజీ విద్యుత్ శక్తితో అల్ట్రాసౌండ్ తరంగాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ మిస్ట్ కూలర్ సైతం జాతీయస్థాయికి ఎంపికైంది.

ఇన్‌స్పైర్.. కావట్లే!

- బాల శాస్త్రవేత్తలకు కేంద్రం ప్రోత్సాహం
- ఎంపికైతే విద్యార్థి అకౌంట్‌లో రూ.10వేలు జమ
- 'ఇన్‌స్పైర్ మనక్'కు దరఖాస్తుల స్వీకరణ
- రెండు నెలల్లో వచ్చినవి 35 మాత్రమే..
- ఆగస్టు 31 వరకు గడువు



కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థి రుషికేష్(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి చర్యలు చేపడుతోంది. విద్యార్థి దశ నుంచే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తోంది. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులతో ఏటా ఇన్‌స్పైర్ మనక్, ఇన్నోవేషన్ కార్యక్రమాల పేరిట ఆవిష్కరణలు తయారు చేయిస్తోంది. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసి కొత్త ఆవిష్కరణలు తయారు చేసే విధంగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇన్‌స్పైర్ మానక్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మే నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ జిల్లాలో నత్తనడకగా సాగుతోంది. ఆగస్టు 31వరకు గడువు ఉంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే వారు భావి తర శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

జిల్లాలో..

ఇన్‌స్పైర్–మనక్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆవిష్కరణలు తయారు చేయవచ్చు. జిల్లాలో 202 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు, 130 ప్రభుత్వ యూపీఎస్‌లు ఉన్నాయి. అలాగే 120 యూపీఎస్ ప్రైవేట్ పాఠశాలలు, 55 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థుల చొప్పున దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో ప్రభుత్వం 10 శాతం పాఠశాలలను ఎంపిక చేస్తుంది. ఎంపికైన విద్యార్థి ఖాతాలో రూ.10వేల చొప్పున జమ చేస్తుంది. వీటిలో రూ.5వేలు విద్యార్థుల రవాణ చార్జీల కోసం, మరో రూ.5వేలు విద్యార్థి తయారు చేసే ప్రాజెక్టుకు వెచ్చించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ఎంపికై న వారిని రాష్ట్రస్థాయికి, అక్కడి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహమేదీ..!

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం విద్యార్థులను ప్రోత్సహించి వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలి. అయితే ఆ దిశగా సర్కారు పాఠశాలల ఉపాధ్యాయులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. మే నెలలో ఇన్‌స్పైర్ అవార్డు కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటివరకు కేవలం 35 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అయితే ఇందులో ఒక్కటి కూడా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు లేవు. అన్ని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు సంబంధించినవి ఉండటం గమనార్హం. విద్యాశాఖ అధికారులు ఒత్తిడి తెస్తే చివరలో ఆదరాబాదరగా దరఖాస్తులు చేయడం పరిపాటిగా మారింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన తర్వాత రెడీమేడ్ ప్రాజెక్టులను కొనుగోలు చేసి మేళాలో ప్రదర్శించడం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. కొంతమంది విద్యార్థులు మాత్రమే సొంతంగా ప్రాజెక్టులను తయారు చేసి ప్రతిభ చాటుతున్నారు. ఈవిషయంఉన్నతాధికారులకుతెలిసినప్పటికీ పట్టించుకోకపోవడంతో షరా మామూలుగా మారింది.

దరఖాస్తు ఇలా..

ఇన్‌స్పైర్ మేళాకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు www. inspireawards. gov. in వెబ్‌సైట్‌లో పేరు, తరగతి, పాఠశాల యూడైస్, ఆధార్, బ్యాంక్ ఖాతా ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురికి అవకాశం ఉంది.

జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు..



జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. సిరికొండ మండలం యూపీఎస్ పొన్నకు చెందిన విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్ట్ అంతర్జాతీయ స్థాయికి ఎంపికైంది. అలాగే ఖానాపూర్ యూపీఎస్‌కు చెందిన విద్యార్థి తయారు చేసిన ప్రయోగం జాతీయ స్థాయికి ఎంపికైంది. బంగారుగూడ విద్యార్థులు రెండుసార్లు జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకున్నారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వారు ప్రాజెక్టులు తయారు చేసేలా కృషి చేయాలి. ఇన్‌స్పైర్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించాలి.

– రఘురమణ, జిల్లా సైన్స్ అధికారి

ఐటీడీఏ పీవోగా చాహత్ బాజ్‌పాయ్

- పతి స్థానంలో సతీ నియామకం
- మూడో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపిక



చాహత్ బాజ్‌పాయ్

కైలాస్‌నగర్/ఆసిఫాబాద్: ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన చాహత్ బాజ్‌పాయ్ గతేడాది జూన్ 13న కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత నిర్మల్ జిల్లా కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సతీమణి చాహత్ బాజ్‌పాయ్. ఎలక్ట్రికల్ ఇంజినీర్‌లో కాన్పూర్ ఐఐటీ నుంచి పట్టా అందుకున్న ఆమె ఐఏఎస్ లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మూడో ప్రయత్నంలో 59వ ర్యాంకు సాధించి ఏపీ క్యాడర్ 2019 బ్యాచ్ ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వరుణ్‌రెడ్డిని వివాహమాడాక తెలంగాణ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. వరుణ్‌రెడ్డి బదిలీతో ఖాళీ అయిన ఆసిఫాబాద్ జిల్లా లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్‌గా 2021లో నియామకమయ్యారు. ఏడాదిన్నర పాటు అక్కడ సేవలందించిన ఆమె తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు ఐటీడీఏ పీవోగా విధులు నిర్వర్తించిన వరుణ్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 8న నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యా రు. అప్పటినుంచే ఆ స్థానంలో చాహత్ బాజ్‌పాయ్ జిల్లాకు రానున్నారనే ప్రచారం అధికారిక వర్గాల్లో పెద్ద ఎత్తున జరిగింది. ఇదే క్రమంలో జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన రిజ్వాన్ బాషాషేక్ ఇటీవల వరంగల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వస్తారనే ప్రచారం సైతం జోరుగా సాగింది. ఊహించినట్లుగానే ఆ ప్రచారానికి తెర దించుతూ ఆమె ఐటీడీఏ పీవోగా నియామకమయ్యారు. తన భర్త పనిచేసిన రెండు చోట్ల ఆమె నియామకం కావడం ఆసక్తికరంగా మారింది. నిజాయతీగా, ముక్కుసూటిగా బాధ్యతలు నిర్వహిస్తారనే పేరున్న చాహత్ బాజ్‌పాయ్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా రానుండడంతో ఆదివాసీల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా సోమవారం పీవోగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ప్రొఫైల్

పేరు	చాహత్ బాజ్‌పాయ్
ఐఏఎస్ బ్యాచ్	2019 ఏపీ క్యాడర్
తల్లిదండ్రులు	ఉషా, ఆర్‌పీ బాజ్‌పాయ్
పుట్టినతేదీ	14.12.1994
విద్యాభ్యాసం	ఐఐటీ కాన్పూర్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీర్ పట్టా
భర్త పేరు	కర్నాటి వరుణ్‌రెడ్డి, ఐఏఎస్
తొలి పోస్టింగ్	పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు అసిస్టెంట్ కలెక్టర్
పదోన్నతి	కర్నూల్ జిల్లా నంద్యాల సబ్ కలెక్టర్
తెలంగాణ ఐఏఎస్ క్యాడర్‌కు బదిలీ అయిన తేదీ	26.08.2021
ప్రస్తుతం	కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా సేవలు

ఆంధ్రోళ్లకే భయపడలే.. ఈ దొంగలకు భయపడతామా

- బతిమిలాడితే జెడ్పీటీసీ టికెట్ ఇచ్చి గెలిపించా..
- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే బాపూరావు

ఆదిలాబాద్‌టౌన్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆంధ్రోళ్లకే భయపడలే.. ఈ దొంగలకు భయపడతామా అని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బోథ్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సొంత పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'బీఆర్‌ఎస్ బి–ఫామ్ ఇస్తే గెలిచిన ఈ దొంగలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, దొంగల టీమ్ ఏర్పాటు చేసుకొని పార్టీని మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కనబడటం లేదని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, ఆ మూర్ఖుడి నాలుక కోసేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యానని, అయినప్పటికీ నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తన వద్దకు వచ్చి జెడ్పీటీసీ కావాలని బతిమిలాడితే పార్టీ టికెట్ ఇప్పించి గెలిపించినట్లు చెప్పారు. కాగా అతను ఎప్పుడు ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంచుతాడని, ప్రజల సమస్యలు పట్టించుకోడని తెలిపారు. 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా గెలుద్దామని ప్రయత్నాలు చేసినా ప్రజలు దగ్గరకు రానివ్వడం లేదన్నారు. మీరు ఎమ్మెల్యేలు కాలేరని, ప్రజాసేవ చేసేవారు ప్రజల్లో ఉండాలని పేర్కొన్నారు.

మూడు అడిగితే... ఒక్కటే!

- సొనాలకు మాత్రమే అవకాశం
- నెరవేరని భోరజ్, సాత్నాల మండలాల హామీ
- అసంతృప్తిలో ఆయా ప్రాంతాల ప్రజలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో మూడు కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గతనెల 30న కుమురంభీం జిల్లా పర్యాటనకు వచ్చిన ఆయన్ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో కలిసి నివేదించారు. ఈమేరకు ముఖ్యమంత్రి కూడా సానుకూలంగానే స్పందించారని, మూడు మండలాలకు సంబంధించి జీవో రానుందని నేతలు ప్రకటించారు. దీంతో తమ కల నెరవేరబోతుందని ఆయా మండలాల వాసులు హర్షం వ్యక్తం చేశారు. తీరా ప్రభుత్వం ఒక్క సొనాల మండలాన్నే ఏర్పాటు చేస్తూ శనివారం జీవో జారీ చేయడంతో భోరజ్, సాత్నాల మండలాలవాసులు నిరాశకు గురయ్యారు. వీటి పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు. మరోసారి ఆ మండలాల హామీ నెరవేరలేదని అభిప్రాయపడుతున్నారు. అయితే మండలం కోసం సొనాల ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమం సాగింది. దీనికి తోడు ఏయే గ్రామాలతో సొనాల కొత్త రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలనే సమగ్ర సమాచారం ఇది వరకే ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అందుకే దాని గెజిట్‌ను ప్రకటిస్తూ జీవో జారీ చేసినట్లుగా అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. భోరజ్, సాత్నాల మండలాలకు సంబంధించి ఏయే గ్రామాలను కలపాలి, ఎన్ని గ్రామాలను వాటి పరిధిలోకి తీసుకురావాలనే సమాచారం కలెక్టర్ ద్వారా ఇంకా ప్రభుత్వానికి చేరలేదని అందుకే ఆ మండలాల జీవో రాలేదని చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో భోరజ్ మండలానికి సంబంధించిన 19 గ్రామాల వివరాలతో కూడిన ప్రతిపాదనలు అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు అందజేశారు. కానీ ఈ మండలం ఏర్పాటు కాలేదు. ఎప్పటి వరకు జీవో వస్తుందనే స్పష్టత లేదు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశమున్నందున ఈలోగా జీవో వస్తుందా లేక మళ్లీ మొండిచేయే ఎదురవుతుందా అనే భావన ఆ మండలాలను కాంక్షిస్తున్న వారిలో వ్యక్తమవుతుంది. అయితే రెండు, మూడు రోజుల్లోనే ఈ మండలాల ఏర్పాటు జీవో రానుందని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి..

- సొనాల మండల ఏర్పాటుపై గెజిట్ విడుదల

బోథ్: మండలంలోని సొనాల గ్రామాన్ని మండలంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఈ నెల 1న జీవో విడుదల చేసింది. ఈమేరకు పది రెవెన్యూ గ్రామాలతో సొనాలను మండలంగా ఏర్పాటు చేస్తూ కలెక్టర్ రాహుల్ రాజ్ గెజిట్ విడుదల చేశారు. వజ్జర్, చింతలబోరి, ఘన్‌పూర్, సొనాల, కౌఠ(కె), సాకెర, టీవీటి, పార్డి(బి), పార్డి(కె), గొల్లాపూర్ రెవెన్యూ గ్రామాలతో మండల ఏర్పాటుపై గెజిట్‌లో వెల్లడించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లో తెలపాలని అందులో పేర్కొన్నారు. లిఖితపూర్వకంగా అందించాలని తెలిపారు.

'అపూర్వ' సమ్మేళనం

బోథ్: నాలుగు దశాబ్దాల తర్వాత బాల్య మిత్రులంతా మళ్లీ ఒక్క చోట చేరారు. పదో తరగతి పూర్తయ్యాక ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 40 ఏళ్ల తర్వాత ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982–83 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒకే ఒక్కడు..!

18 ఏళ్లుగా ఒకే మండలంలో..



ఏ ప్రభుత్వ శాఖ ఉద్యోగికి అయినా బదిలీలు, ప్రమోషన్లు ఉంటాయి. కానీ విద్యాశాఖలో ఎంఈవోల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దీంతో ఏళ్ల తరబడి ఒకే మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే రిటైర్ అవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక రెగ్యులర్ ఎంఈవో సోమయ్య 18 ఏళ్లుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన సోమయ్య 1997లో స్కూల్ అసిస్టెంట్‌గా అపాయింట్‌మెంట్ అయ్యాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2005లో రెగ్యులర్ ఎంఈవోగా ప్రమోషన్ రావడంతో కౌటల మండలం ఎంచుకున్నాడు. తర్వాత ఉమ్మడి సర్వీసుకు సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ఎంఈవోల బదిలీలు, ప్రమోషన్లు నిలిచిపోయాయి. అప్పటి నుంచి బదిలీ, పదోన్నతికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం కౌటాలకు రెగ్యులర్ ఎంఈవోగా, సిర్పూర్ (టి), చింతలమానపల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో కౌటాలకు మాత్రమే పర్మినెంట్ ఎంఈవో
- 69 మండలాలకు 27 మంది ఇన్‌చార్జీలు...
- ఒక్కొక్కరికి మూడు మండలాల బాధ్యతలు
- పర్యవేక్షణ సక్రమంగా లేక బోధనకు ఆటంకాలు

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి జిల్లాలో పాఠశాలల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల విద్యను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు కేటాయిస్తూ.. నూతన విద్యావిధానం ప్రకారం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. మన ఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఎంపిక చేసిన పాఠశాలలకు రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో వాటిని పర్యవేక్షించే మండల విద్యాధికారులు మాత్రం లేరు. జిల్లాల పునర్విభజనతో కొత్త మండలాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. వాటికి ఇప్పటికీ ఎంఈవోలను నియమించలేదు. పేరుకే మండలాలు తప్ప వాటి పరిధిలో విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు యంత్రాంగం పూర్తిస్థాయిలో లేదు. పాత మండలాలకే హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్త మండలాలు ఏర్పడిన తర్వాత వాటి బాధ్యత కూడా విద్యాశాఖ వీరికే అప్పగించింది. ఓ వైపు హెచ్‌ఎంగా, మరోవైపు రెండు మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించడం భారంగా మారుతోంది. తమ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించే సమయం లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో 69 మండలాలు ఉండగా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలానికి మాత్రమే సోమయ్య రెగ్యులర్ ఎంఈవోగా ఉన్నారు. ఈయన కూడా 18 ఏళ్లుగా ఒకే మండల విద్యాధికారిగా కొనసాగుతుండడం గమనార్హం.



జిల్లా	మండలాలు	ఎంఈవోలు
ఆదిలాబాద్	18	08
మంచిర్యాల	18	07
నిర్మల్	18	06
కుమురంభీం	15	06

హెచ్‌ఎంలకే ఎంఈవోలుగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల మినహా మిగతా 69 మండలాలకు 26 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు ఒకవైపు తమ పాఠశాలల బాధ్యతలు పర్యవేక్షించడంతోపాటు, తాము ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ఒక మండలంలో 100 నుంచి 200 మంది ఉపాధ్యాయుల పనితీరు, పది నుంచి 15 పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ఇక ఒక్కో ఇన్‌చార్జి ఎంఈవోకు రెండు, మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు. అంటే ఒక ఇన్‌చార్జి ఎంఈవో కనీసం 500 మంది ఉపాధ్యాయుల పనితీరు, 40 నుంచి 50 పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. దీంతో అటు హెచ్‌ఎంగా సొంత పాఠశాలకు, ఇటు ఎంఈవోగా మూడు మండలాలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

అసలే ఇన్‌చార్జీలు.. ఆపై అదనపు బాధ్యతలు..

ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలకు ఎనిమిది మంది, మంచిర్యాలలో 18 మండలాలకు ఏడుగురు, నిర్మల్ జిల్లాలో 18 మండలాలకు ఆరుగురు, ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాలకు ఆరుగురు (కౌటాల మినహా) అంతా ఇన్‌చార్జి ఎంఈవోలే. వీరంతా తమ పాఠశాలలో ఒకటి రెండు పీరియడ్‌లు పాఠాలు బోధించాలి. మిగతా సమయాల్లో పాఠశాలకు సంబంధించిన నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించాలి. మరోవైపు తాము ఇన్‌చార్జిగా ఉన్న మండలాల్లో ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల నిర్వహణను కూడా చూసుకోవాలి. తనిఖీలు చేయాలి. ఏళ్లుగా ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో హెచ్‌ఎంలనే ఇన్‌చార్జి ఎంఈవోలుగా విద్యాశాఖ నియమిస్తోంది. ఈ కేసు కొలిక్కి వస్తేగానీ పూర్తిస్థాయి ఎంఈవోలు వచ్చే అవకాశం లేదు.

ఎప్పుడు ఏ మండలంలో ఉంటారో..

ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఎప్పుడు ఏ మండలంలో ఉంటారో తెలియని పరిస్థితి. ఉపాధ్యాయులకు ఏదైనా అవసం పడి ఎంఈవోను కలవాలంటే.. ముందుగా ఎక్కడ ఉన్నారో తెలుసుకుని ఆ మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక విద్యాశాఖ సమీక్షలు, సమావేశాలు ఉంటే.. జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందే.

ఫలితాలపై ప్రభావం..

పాఠశాలల పనితీరు పర్యవేక్షణతోపాటు తనిఖీలు చేసే అధికారులు పూర్తిస్థాయిలో ఇన్‌చార్జి ఎంఈవోలకు లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ఈ క్రమంలో కొంతమంది ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదు. సమాచారం లేకుండానే గైర్హాజరవుతున్నారు. ఈ కారణంగా పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రభావం ఫలితాలపై పడుతోంది.

క్లుప్తంగా

జిల్లావాసికి భారతశిక్ష పద్మభూషణ్ అవార్డు



అవార్డు అందుకున్న జెమి సుధాకర్

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జెమి సుధాకర్‌కు ప్రతిష్టాత్మక భారత శిక్ష పద్మభూషణ్ పురస్కారం దక్కింది. ఇటీవల ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. విద్యారంగంలో అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు దక్కడంతో మరింతగా బాధ్యత పెరిగిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

సుధీర్‌కుమార్‌కు ప్రతిభామూర్తి పురస్కారం


అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్

కైలాస్‌నగర్/ఇచ్చోడ: జిల్లాలోని ఇచ్చోడ మండలం అడేగాం(కే) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సుధీర్ కుమార్‌కు ప్రతిభామూర్తి పురస్కారం దక్కింది. వివిధ రంగాల్లో ప్రజలకు సేవలందించిన వారికి తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, సత్య సంగీత ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఏటా ఈ పురస్కారాలు అందజేస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. తన సంగెం ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయన ఈ అవార్డును ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుర్మాచలం చేతుల మీదుగా అందుకున్నారు. సుధీర్‌కుమార్‌కు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తు ఆయనకు అభినందనలు తెలిపారు.

పీవోను కలిసిన కనకరాజు


పుష్పగుచ్ఛం అందిస్తున్న కనక రాజు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా నూతనంగా నియమితులైన చాహత్ బాజ్‌పాయ్‌ని పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఆయన వెంట తోటి సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మర్సుల తిరుపతి, గిరిజన నాయకులు ఉన్నారు.

'రిజర్వేషన్లు ఇవ్వొద్దు'

ఎదులాపురం: మతం మారిన దళిత క్రైస్తవ, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంశీతిలక్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శిశుమందిర్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల ఇవ్వాలా.. వద్దా..విషయంపై కేంద్రం కేజీ బాలకిషన్ కమీషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా పాత రిజర్వేషన్ల విధానాన్ని కొనసాగించేలా నివేదిక ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద్, దళిత, ప్రజా, హిందూ సంఘాల నాయకులు రమేశ్, సుభాష్, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ సఫారీకి బ్రేక్


జంగిల్ సఫారీలో అడవుల్లో పర్యటిస్తున్న పర్యాటకులు (ఫైల్)

- జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేత
- అక్టోబర్ నుంచి తిరిగి ప్రారంభం

జన్నారం: కవ్వాల్ అభయారణ్యం అంటేనే అడవులు, వన్యప్రాణులకు పెట్టింది పేరు. పక్షుల కిలకిల రావాలు, లేడి పిల్లల పరుగులు, జలజలమంటూ దట్టమైన అడవుల మధ్య నుంచి పారే సెలయేర్లు, పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం ఇవి కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లోని ప్రత్యేకతలు. ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకశాఖ జన్నారంలో హరిత రిసార్ట్‌లు, రెస్టారెంట్లతోపాటు జంగిల్ సఫారీలు ఏర్పాటు చేసింది. పర్యాటకులు సఫారీలో అడవిలోకి వెళ్లడం, దట్టమైన అడవిలో పచ్చని చెట్ల నడుమ పర్యటించడంతో ఆహ్లాదాన్ని పొందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అడవుల అందాలను, వన్యప్రాణుల పరుగులను చూసేందుకు వస్తుంటారు. పర్యటకశాఖ అధికారులు రిసార్ట్ ద్వారా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

తాత్కాలిక బ్రేక్

అడవుల అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులకు మూడు నెలల పాటు ఈ ఆహ్లాదం కోల్పోతారు. ఎందుకంటే అటవీశాఖ అధికారులు జంగిల్ సఫారీలు అడవుల్లోకి వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తున్నారు. వర్షాకాలంలో వన్యప్రాణులు బయటకు వస్తాయి. ఎదకు వచ్చి బయట తిరుగడానికి ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో అటవీశాఖ అధికారులు పర్యాటకులను సఫారీల ద్వారా ఈ నెల నుంచి అడవుల్లోకి అనుమతి రద్దు చేశారు. ఇన్ని రోజులు రిసార్ట్‌కు వచ్చిన పర్యాటకులు ఉదయాన్నే జంగిల్ సఫారీల ద్వారా అడవులకు వెళ్లితే వన్యప్రాణులు ప్రత్యేక్షంగా కనిపించడం, వన్యప్రాణులతో పాటు పచ్చని వాతావరణంతో పర్యటకులు ఆహ్లాదం పొందుతారు. ఇక్కడికి వచ్చే అత్యధిక మంది పర్యాటకులు అడవులు, వన్యప్రాణులను చూసేందుకే వస్తారు. కానీ అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించొద్దని, అడవుల్లో వర్షాలకు బురద కారణంగా ఇబ్బంది ఏర్పడుతుందనే ఉద్దేశంతో మూడు నెలలు (జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు పర్యాటక శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

పెరిగిన తాకిడి

జన్నారం పర్యటకశాఖకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. వీకెండ్ రోజులు శుక్ర, శని, ఆదివారాల్లో హరిత రిసార్ట్‌లు అన్నీ నిండుకుంటున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తమ వాహనాలతో రోడ్డు మార్గంలోని అడవులను చూసి ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఇన్ని రోజులు ఎండలకు సతమతమైన వారు ఇప్పుడు చల్లగా, పచ్చదనం కోసం ఆహ్లాదాన్ని ఆస్వాదించేందుకు ఇక్కడికి వస్తుంటారు. కానీ అడవుల్లో సఫారీ ద్వారా వెళ్లడానికి బ్రేక్ వేయడంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.

వర్షం పడితే వాహనాలకు ఇబ్బంది...


వన్యప్రాణులకు ఇబ్బందులు కాకుండా, వర్షాల కారణంగా బురదలో వాహనాలు కూరుకుపోయి ఇబ్బందుల ఏర్పడే అవకాశం ఉంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఉన్నత అధికారుల ఆదేశాలతో జూలై నుంచి సెప్టెంబర్ వరకూ అడవుల్లో జంగిల్ సఫారీలకు అనుమతి ఇవ్వడం లేదు.

– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

చార్జింగ్ పంప్‌తో నీరందిస్తూ..


చార్జింగ్ పంప్ ద్వారా నీటిని అందిస్తున్న కూలీలు

తాంసి: వానాకాలం సీజన్ ప్రారంభంలో జిల్లాలో రైతులు పత్తి, సోయా విత్తనాలు నాటారు. వర్షాలకు మొలకెత్తే దశలో ఉన్నాయి. గత ఆరు రోజులుగా వానలు ముఖం చాటేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సదుపాయం ఉన్న రైతులు స్ప్రింకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శివారులో జాదవ్ గణేశ్ తన మూడెకరాల్లో పత్తి విత్తనాలు నాటగా, కూలీలతో నీటిని అందించే చర్యలు తీసుకున్నారు. వాటర్ ట్యాంకర్ ద్వారా డ్రమ్ముల్లో నీరు నింపి ముగ్గురు కూలీలతో చార్జింగ్ పంప్‌లతో నీటిని అందిస్తున్నారు.


ట్యాంకర్ నుంచి డ్రమ్ములోకి నీటిని నింపుతున్న రైతు

దేశవాళీ క్రీడలకు అంతర్జాతీయ గుర్తింపు

ఆదిలాబాద్: దేశవాళీ క్రీడలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆత్యాపాత్య క్రీడా సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, యోగా తదితర నేడు అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతున్నాయన్నారు. మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆత్యాపాత్య క్రీడా సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, డీఎస్ఏ అధికారి ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆత్యాపాత్య జిల్లా నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా కలాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మెస్రం గణేశ్, ఉపాధ్యక్షులుగా హరిచరణ్, రామ్ కుమార్, శివకుమార్, శ్వేత, కోశాధికారి అజయ్, జాయింట్ సెక్రెటరీగా మజార్, స్వర్ణలత, నవీన్, గౌతమ్, సింధు, నిర్వాహక కార్యదర్శిగా జ్యోతి, చంద్రకాంత్, గంగోత్రిని ఎన్నుకున్నారు. కమిటీ మెంబర్లుగా వెంకటరమణ, జాషువా, కృష్ణ, స్ఫూర్తి, వర్షిత, అతీష్, కోటేశ్, సమీర్, సాయివర్ధన్ ఎన్నికయ్యారు.


కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

స్నానానికి వెళ్లి.. ప్రమాదవశాత్తు చెరువులో పడి

- మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

నిర్మల్‌టౌన్: స్నానానికి వెళ్లి ఒకరు చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవార్‌పేట్‌లోని ఎస్సీ కాలనీకి చెందిన ఉప్పిరి చిన్ని (34) మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బంగల్‌పేట్‌లో గల శ్మశానవాటికలో అనాధ శవానికి దహన సంస్కారాలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న బంగల్‌పేట్ చెరువులో తోటి ఉద్యోగితో స్నానం చేయడానికి వెళ్లి జారిపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు (9), కుమార్తె (8) ఉన్నారు.


ఉప్పిరి చిన్ని(ఫైల్)

కుటుంబీకుల ఆందోళన

చెరువుకట్టపై మృతదేహంతో కుటుంబీకులు, కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. అనాధ శవం దహన సంస్కారాలకు సంబంధిత మున్సిపల్ జవాన్, శానిటరీ సిబ్బంది ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము వారితో మాట్లాడారు. కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగంతోపాటు ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ

ఖానాపూర్: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ జరిగిన సంఘటన పట్టణంలోని విద్యానగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ కథనం ప్రకారం.. తర్లపాడ్ గ్రామానికి చెందిన చింతపండు రాజమణి విద్యానగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటుంది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మార్కెట్, ఆసుపత్రికి వెళ్లింది. రెండు గంటల తర్వాత తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో తులం బంగారు ఆభరణాలతోపాటు రూ.500 నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో క్లూస్‌టీం సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఇద్దరు మృతి

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన ఉపారపు రాజేందర్ (22) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. లక్ష్మి–పోషన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పేద కుటుంబం కావడంతో ఇద్దరు కుమారులు ఉపాధి నిమిత్తం దుబాయ్ వలసవెళ్లారు. పెద్ద కుమారుడైన రాజేందర్ గత నాలుగు నెలల క్రితం లక్ష్మీసాగర్‌కు వచ్చాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడకున్న కొడుకు హఠాన్మరణంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

సోన్‌లో..

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన చిలుక స్వామి (42) గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. స్వామి గ్రామంలో హోటల్ నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజులాగా హోటల్ నుంచి శనివారం రాత్రి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఛాతీలో నొప్పి వస్తుందని కుటుంబీకులకు చెప్పారు. అతన్ని వెంటనే అర్ధరాత్రి నిర్మల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు (13), కుమారుడు (12) ఉన్నారు.

డువ్వల్‌పేన్‌కు ప్రత్యేక పూజలు


భక్తి శ్రద్ధలతో పాతిన ముండ(కర్ర)


పులిదేవతకు మొక్కుతున్న సాకడా వాసులు

- మూడేళ్లకు ఓసారి మొక్కులు
- అనాదిగా వస్తున్న ఆచారం
- పులిని వేటాడిన చోటే ముండ(కర్ర)ను పాతిన సాకడ ఆదివాసీలు

కెరమెరి: అటవీ జంతువులను దేవతలుగా భావించి.. వాటి నుంచి రక్షణ కల్పించడంలో తమకు తామే సాటిగా ఆదివాసీలు నిలుస్తున్నారు. ఆషాఢమాసం వచ్చిందంటే విభిన్న పండుగలు చేస్తూ తమ పూజలతో అడవి తల్లితో పాటు కుల దేవతలను సైతం ప్రసన్నం చేసుకుంటున్నారు. మండలంలోని చిన్నసాకడకు చెందిన ఆదివాసీలు పులివేటను కట్టడి చేసేందుకు 1935లో ప్రారంభించిన 'డువ్వల్ పేన్' (పులి దేవత) పూజను నేటికి నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆ గ్రామంలోని శివారులో పులి దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నూతంగా ముండ(కర్ర)ను పాతి వనంలో ఉత్సవం చేసుకున్నారు. వనంలోనే వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనం చేశారు.

'డువ్వల్ పేన్' కు పూజ


అది 1935వ సంవత్సరం.. పెందోర్ జంగు కుటుంబం చిన్నసాకడ గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది. ఆ చుట్టుపక్కల గ్రామాలు లేవు. నాలుగు కిలో మీటర్ల దూరంలో కెరమెరి, పెద్దసాకడ, సాకడ(ఏ) అనే గ్రామాలతో పాటు 15కిలో మీటర్ల దూరంలో అనార్‌పలి, గోయగాం తదితర గ్రామాలున్నాయి. ఆ గ్రామాల్లో కూడా అతి తక్కువ కుటుంబాలు ఉండేవి. ఈ తరుణంలోనే పెద్దపులి తన పిల్లలతో అడవిలోకి ప్రవేశించింది. సాగు చేసేందుకు అడవిని నరికేందుకు వెళ్లిన రైతులను వేటాడి చంపి తినేది. విషయం తెలుసుకున్న పెందోర్ జంగు పులిని పట్టుకునేందుకు చాలాసార్లు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అడవులను నరికి వ్యవసాయం చేద్దామని వెళ్లిన కొహ్చాడ శేకును అతడి ముందే పులి పట్టుకుని వెళ్లి చంపేసింది. దీంతో కసిపెంచుకున్న జంగు ఓ రోజు నీళ్లు తాగేందుకు వచ్చిన పులిని నీరు తాగుతున్నప్పుడు బండరాయితి కొట్టి చంపాడు. అనంతరం శేకు చనిపోయిన చోట పులిదేవత ముండ(కర్ర)పాతి ప్రత్యేక పూజలు చేశారు. అప్పటి నుంచి మూడేళ్లకోసారి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఎంతో నియమనిష్టతో..


ప్రతీ మూడేళ్లకు ఓసారి డువ్వల్ పేన్ పూజలను ఎంతో నియమ నిష్టతో చేస్తాం. మా తాత నుంచి వస్తున్న ఆచారాలు, సంస్కృతిని, దేవతలను పూజిస్తున్నాం. పెద్దలు చూపిన మార్గంలోనే ఇప్పటికీ నడుస్తున్నాం.

– పెందోర్, దంబిరావు, కటోడా చిన్నసాకడ

చంపిన చోటే పూజ


శేకు అనే రైతును చంపిన చోటే ఓ ముండ (కర్ర) పాతి పూజలు చేశాం. ఆకాడి రోజే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అషాఢ మాసంలో వనదేవతలు, ఇంటి దేవతలు, పెర్సాపేన్, ఏత్మాసార్, ఆకి పేన్‌కు పూజలు చేస్తే అన్ని సవ్యంగా జరుగుతాయి.

– సెడ్మకి జంగు, గ్రామ పెద్ద, చిన్నసాకడ

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

తానూరు: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. తానూరుకు చెందిన కారగిరి ఎల్లప్ప (40) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన పొలానికి వెళ్లి అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హోటల్‌లో పనిచేస్తున్న వ్యక్తి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్‌లో గల హోటల్‌లో పనిచేస్తున్న హమ్రే వసంత్‌రావు(53) మృతిచెందాడు. ఎస్సై సాదిక్ హుస్సేన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా తాంస తాలూకా వైపన్ గ్రామానికి చెందిన వసంత్‌రావు హోటళ్లలో పనిచేస్తుండేవాడు. గతంలో లోకేశ్వరం, నర్సాపూర్‌లోని హోటళ్లలో పనిచేయగా, కొద్దికాలంగా భైంసా బస్టాండ్‌లోని హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి మద్యం తాగి హోటల్‌లో పడుకున్నాడు. ఆదివారం ఉదయం యజమాని వచ్చి లేపేందుకు యత్నించినా లేవలేదు. దీంతో సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భారతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. గాదిగూడ మండలం కడాడి గ్రామానికి చెందిన మడావి నగేశ్, మడావి మాధవ్‌లు గుడిహత్నూర్ నుంచి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి బొలెరో వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, ప్రయణికులు 108 అంబులెన్స్‌లో అదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

బాసరలో భక్తుల రద్దీ

భైంసా(ముథోల్): బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు స్పెయిన్ దేశస్తులు కూడా దర్శించుకున్నారు. ముందుగా గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి.. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ట్రిపుల్‌ఐటీ మెరిట్ జాబితా విడుదల

భైంసా(ముథోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో ఈ ఏడాది ప్రవేశాలకు సంబంధించి వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తుల్లో మెరిట్ జాబితాను సోమవారం విడుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది 1,404 జనరల్ సీట్లు, 96 ప్రత్యేక కేటగిరీ సీట్లు, 105 గ్లోబల్ సీట్లు కలిపి మొత్తంగా 1,605 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 7 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ట్రిపుల్‌ఐటీలో ప్రవేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఈఏడాది 13,538 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే దరఖా స్తుల పరిశీలన వేగవంతం చేశామని, ఇందుకు ఇప్పటికే 60 మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ వెల్లడించారు.

వ్యాసమహర్షి ప్రతిష్టించిన క్షేత్రం

- బాసర సరస్వతీ ఆలయం
- కొనసాగుతున్న గురుపౌర్ణమి ఉత్సవాలు

భైంసా: బాసరలో గురుపౌర్ణమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు సోమవారం వరకు జరుగనున్నాయి. మూడు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారు. వ్యాసమహర్షి ఆలయంలో వైదిక బృందం ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేసింది. నేటితో గురుపౌర్ణమి ఉత్సవాలు ముగియనున్నాయి.

దక్షిణ భారతంలోనే ప్రసిద్ధి

శ్రీజ్ఞాన సరస్వతీ, లక్ష్మీదేవి, మహంకాళిదేవి కొలువుదీరిన పవిత్ర క్షేత్రంగా దక్షిణ భారతదేశంలో బాసర ఆలయానికి పేరుంది. సరస్వతీ దేవి మూడు పీఠాల్లో అతి ముఖ్యమైన ఇక్కడి ఆలయంగా ప్రఖ్యాతిగాంచింది. కశ్మీర్‌లో జలంధర్‌పీఠం, సుంగిడిలో కామపీఠాలు ఉండగా బాసరలో ఉన్నదానికి పుష్కర పీఠం అని పేరు. వ్యాసునికి జ్ఞానాన్ని ప్రసాదించిన క్షేత్రంగా ఈ ఆలయానికి పేరుంది. వ్యాసుడు తపస్సు చేసి పూజలు నిర్వహించి గోదావరి నుంచి తీసుకువచ్చిన ఇసుకను పేర్చగా సరస్వతీ రూపం తయారైందని అంటారు. ఇప్పుడు బాసరలో జ్ఞాన సరస్వతీది ఇసుక విగ్రహమే. దీంతోపాటు మహంకాళి, లక్ష్మీదేవి విగ్రహాలను వ్యాసుడు ఇక్కడ ప్రతిష్టించారని చెబుతారు.


బాసర సరస్వతీ ఆలయం

పెరుగుతున్న భక్తులు

వ్యాసమహర్షి ప్రతిష్టించిన ఈ క్షేత్రం నాడు వాసరగా నేడు బాసరగా పిలుస్తున్నారు. జ్ఞానాన్ని ప్రసాదించిన అమ్మవారి చెంత ప్రతిఏటా అక్షరాభ్యాస పూజలు జరుగుతున్నాయి. పిల్లలకు బడిలో చేర్పించే ముందు తల్లిదండ్రులు వారిని ఇక్కడికి తీసుకువచ్చి అక్షరశ్రీకార పూజలు చేయిస్తున్నారు. దేశ నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో వస్తున్నారు. ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాట్లు పెరిగాయి. నూతనంగా అక్షరాభ్యాస మండపాలు నిర్మించారు.

కోనేరు పక్కనే వ్యాసమహర్షి గుడి

బాసర చేరుకోగానే ఆలయానికి వెళ్లేమార్గంలో వ్యాస మహర్షి గుడిని నిర్మించారు. అక్కడ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. వ్యాసమహర్షి అమ్మవారి కోసం తపస్సు చేసిన గుహలో భక్తులు వెళ్తుంటారు. గుట్టపైన వ్యాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతంలో ఇప్పటికి ప్రతీరోజు పూజలు చేస్తున్నారు.